క్లుప్తంగా

## చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ విడుదల



ఖిల్లాఘనపురం: జనవిజ్ఞాన వేదిక తెలంగాణ, సమగ్ర శిక్ష అభియాన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే చెకిముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను టాలెంట్ టెస్టు కన్వీనర్ బత్తుల శ్రీనివాసులు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాళిదాసు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 8 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఈ టెస్టులో ఎక్కువ మందిని పాల్గొనేలా చూడాలన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన, అభిరుచిని పెంచేందుకు ఈ టెస్టు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 7న పాఠశాల స్థాయిలో, 20న మండల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, హీరాలాల్, సునీత, రజిత, అయేషా, అంజలయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు




వనపర్తిటౌన్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నాగవరంలోని బీసీ ఏ, బీ హాస్టల్ విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు కడుకుంట్ల పీహెచ్‌సీ వైద్యురాలు రష్మికారెడ్డి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కాలంలో విద్యార్థులను ఆరోగ్యంగా ఉంచేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల భోజనానికి ముందు, తర్వాత కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు ఎస్.అంజనేయులు, నరేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూ ఆక్రమణ నిందితులను శిక్షించాలి

పాన్‌గల్: భూమిని ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్న ఘటనలో నలుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాజిపల్లికి చెందిన పర్వతరెడ్డి శేషిరెడ్డి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి. హైదరాబాదులో నివాసం ఉంటున్నాడు. గ్రామ శివారులో సర్వేనెం. 103, 104, 125, 127, 130, 131, 132, 133, 135, 139, 149లో 4:34 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. గ్రామ శివారులో సర్వేనెం. 135, 138 లో 2:32 ఎకరాల భూమిని పాలివారి వద్ద కొని అతడి భార్య పద్మమ్మ పేరుపై 28ఏళ్ల క్రితం పట్టా చేయించారు. పైన సూచించిన భూమిని సోదరుడైన పర్వతరెడ్డి నాగిరెడ్డి కుటుంబానికి కౌలుకు ఇచ్చాడు. కొన్నేళ్ల కౌలు డబ్బులు ఇచ్చినా.. 15ఏళ్ల నుంచి కౌలు డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో భూమిలో పంటలు సాగు చేయొద్దని చెప్పినా పంటలు సాగు చేస్తూ వారే అనభవిస్తున్నారు. దీనిపై తన సోదరుడు నాగిరెడ్డి, వదిన లలితమ్మ, సోదరుడి కుమారులు విష్ణువర్ధన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శేషిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు హెల్త్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి అన్నారు. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు టీకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, తల్లిదండ్రులు తమ చిన్నారులకు సమయానికి అనుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన చిన్నారులకు వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. గర్భిణులు కూడా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకుంటూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు.

## వృద్ధాశ్రమం సందర్శన

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని వృద్ధాశ్రమం, బాలసదన్, చిల్డ్రన్ హోం, చేయూత ఆశ్రమాలను బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రజని సందర్శించారు. ఆయా కేంద్రాల్లో వృద్ధులు, విద్యార్థులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు.

# సమగ్ర సర్వే ప్రారంభం

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి స్టికర్లు వేయించి, సర్వేలో భాగంగా ఇళ్లకు వేస్తున్న నంబర్లను సరిగా వేయాలన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ దాదాపు 150 నుంచి 170 ఇళ్లను కేటాయించామన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎస్.సరస్వతి, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఎస్‌ఓ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట, సోళీపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేపట్టే సమయంలో ఎన్యుమరేటర్లకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి మాట్లాడుతూ మండలంలో మొత్తం 77 మంది ఎన్యుమరేటర్లు గ్రామాల్లో సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు.



బునాదిపురంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

వనపర్తి: మండలంలోని రాజపేటలో చేపడుతున్న ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను బుధవారం ఆర్‌డీఓ సుబ్రమణ్యం ఎంపీడీఓ రాఘవతో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ వేసి గ్రామంలో దండోరా వేసి ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ అధికారికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు మండలంలో..

మండలంలోని బున్యాదిపురం, పాతపల్లి, కొత్తసూగూరు, రంగాపూర్, అయ్యవారిపల్లి గ్రామాల్లో మండల నోడల్ అధికారి నాగేంద్రం, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ రవీంద్ర ఇంటింటి సర్వేను పరిశీలించారు. పెబ్బేరు మండలంలో 6,762 ఇళ్లు ఉండగా.. 71 మంది ఎన్యూమరేటర్లు సమగ్ర సర్వేకు నియమించారు.

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వేలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఇళ్లకు స్టిక్కరింగ్ వేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ఎన్యుమరేటర్లు తిరిగి కుటుంబ వివరాల ఆధారంగా ఇంటిపై స్టిక్కర్ వేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సర్వేకు ముందు రోజు చాటింపు వేయించాలన్నారు. కొత్తపేట, మాందాపూర్, రాయినిపల్లి గ్రామాల్లో డీటీ అశోక్‌నాయుడు పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.



పెద్దమందడిలో సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు బుధవారం ప్రారంభించారు. మండలంలో మొత్తం 53 ఎన్యుమరేటర్లు బ్లాకులను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందితో పాటు ఐదు మంది సూపర్‌వైజర్లను కూడా నియమించారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం అధికారులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు విజ్ఞప్తి చేశారు.



పాన్‌గల్‌లో..



వీపనగండ్లలో..



రాజపేటలో..



పాన్‌గల్ మండలం కొత్తపేటలో..

## దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పాన్‌గల్: భార్య, భర్తలను దూషించి గాయపర్చారని, భార్యాభర్తలతో పాటు వారి కుమారులు దాడి చేసిన గాయపర్చారని మరొకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని శాగాపూర్‌కు చెందిన నర్సింహ, వెంకటమ్మ దంపతులు. ఈనెల 5న సాయంత్రం గ్రామం నుంచి వనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రంలోని పాల్కిచెరువు సమీపంలో పాన్‌గల్‌కు చెందిన గోవిందమ్మతో మాట్లాడుతుండగా ఇదే గ్రామానికి చెందిన ఎరుకలి రాజు అక్కడికి వచ్చి తమ గ్రామానికి ఎందుకు వచ్చారు అంటూ వెంకటమ్మ, నర్సింహపై రాయితో దాడి చేసి గాయపర్చాడు. దీంతో ఎరుకలి రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదే ఘటనలో రాజు అనే వ్యక్తి నర్సింహ, వెంకటమ్మ, వారి కుమారులు సురేందర్, సురేష్ తనను దూషించి ఇటుక పెళ్లతో దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సెల్‌ఫోన్ అందజేత

వనపర్తి రూరల్: వనపర్తికి చెందిన నీలవర్ధన్‌రెడ్డి సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోను ఆచూకీని గుర్తించి, రికవరీ చేశామని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సెల్‌ఫోన్ అందజేశారు.

అమరచింత: కొన్ని రోజుల కిందట పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను బాధితులకు బుధవారం అందించామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన ఆసిఫ్, నాగల్‌కడ్మూర్‌కు చెందిన సురేందర్ రెడ్డి తమ స్మార్ట్‌ఫోన్లు పోయాయని గత నెలలో ఫిర్యాదు ఇచ్చారు. ఫిర్యాదును స్వీకరించి ట్రేస్ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని డీడబ్ల్యూఓ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. నవంబర్4న అంగన్‌వాడీ టీచర్లతో ఐసీడీఎస్ అధికారులు, మంత్రి ఆధ్వర్యంలో సచివాలయంలో చర్చలు జరిపినట్లుగా మీడియాలో వచ్చిందన్నారు. ఈ చర్చలకు అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్‌లో పెద్ద సంఘమైన సీఐటీయూ యూనియన్‌ను ఆహ్వానించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. తమ యూనియన్ తరఫున అంగన్‌వాడీల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, నందిమళ్ల రాములు, జిల్లా నాయకులు సుమతి, తస్లీమా, పుష్ప, అరుణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



డీడబ్ల్యూఓ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## 'సివిల్ సప్లయ్ శాఖలో అవినీతిపై విచారణ చేయాలి'

వనపర్తి: జిల్లా సివిల్ సప్లయ్ శాఖలో చోటు చేసుకున్న అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వనపర్తి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ఇర్ఫాన్ గతంలో పనిచేసిన ప్రతిచోట అవకతవకలకు పాల్పడి రెండుసార్లు సస్పెండ్ అయ్యారని, ఆయన వనపర్తిలోనూ.. అదే తీరుతో పని చేస్తున్నట్లు ఆరోపించారు. ఆయనను ఇటీవల బదిలీ చేసినా నిబంధనలను పక్కన పెట్టి రిలీవ్ కావటం లేదని, వనపర్తి డీఎంగా బదిలీపై వచ్చిన అధికారి బాధ్యతలు తీసుకోనివ్వకుండా వెనుదిరిగేలా చేశారన్నారు. డబ్బుల కోసం మిల్లర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈ విషయంలో ఉన్నధికారులు విచారణ చేస్తే.. చాలా విషయాలు బయటకు వస్తాయన్నారు. వనపర్తి జిల్లాలో గోదాములు ఖాళీగా ఉన్నప్పటికీ స్వప్రయోజనాల కోసం షాద్‌నగర్‌లో గోదాములు లీజుకు తీసుకుని అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. రాఘవేందర్‌గౌడ్, మహేందర్ నాయుడు, శివశంకర్, మ్యాదరి రాజు, నాగరాజుగౌడ్, రామన్‌గౌడ్, రమేష్, సత్యన్న ఉన్నారు.

# వైద్యసేవలపై నిర్లక్ష్యం తగదు

వనపర్తి: డిసెంబర్ నాటికి జిల్లాలోని ముప్పై ఏళ్లు పైబడిన వారందరికీ మధుమేహ వ్యాధి వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సిబ్బందికి ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని లేబర్ వార్డుల్లో సదుపాయాలు సమకూర్చి ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రస్తుతం అయిదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేస్తున్న ఉచిత మధుమేహ పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని మరిన్ని ప్రాథమిక కేంద్రాల్లో విస్తరించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే గర్భిణుల వివరాలు సేకరించి వారి వివరాలు సైతం నమోదు చేయాలన్నారు.

జిల్లావ్యాప్తంగా 713 ప్రసవాలు

అక్టోబర్‌లో జిల్లా వ్యాప్తంగా 713 ప్రసవాలైతే.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 491, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 222 ప్రసవాలు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 75 శాతం ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా గడువు దాటిన తర్వాత గర్భ విచ్ఛిత్తి చేస్తే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దిష్ట గడువు దాటిన తర్వాత గర్భ విచ్ఛిత్తి చేయించేందుకు జిల్లా కమిటీ ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ (ఆభా) నమోదు నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆశా కార్యకర్తలకు వారి దినచర్య పుస్తకాలను అందజేశారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్, సహాయ అధికారి డా.శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సాయినాథ్‌రెడ్డి, డా.పరిమళ, డా. రామచంద్రరావు, డా.ఝాన్సీ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు అంగీకార పత్రాలిస్తేనే..

మారిన నిబంధనల మేరకు మిల్లర్లు అంగీకార పత్రాలు ఇస్తేనే.. ధాన్యం కేటాయింపులు చేస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ విషయమై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సమర్పించేందుకు కేవలం వారం రోజుల గడువు మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పెండింగ్ ఉన్న సీఎంఆర్ అప్పగింత విషయంలో నవంబర్ చివరి నాటికి ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. సమావేశంలో సివిల్ సప్లై డీఎం ఇర్ఫాన్, డీఎస్‌ఓ కాశీవిశ్వనాథ్, డీఈఓ గోవింద్‌నాయక్, మిల్లర్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# అన్నదాతల సంక్షేమమే ఎజెండా

ఆత్మకూర్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసి వ్యవసాయానికి మహర్దశ తీసుకొచ్చారని, అదేబాటలో సీఎం రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని పిన్నంచర్లలో, స్థానిక మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తున్నామని, రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని రైతులకు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఇదివరకే రూ.60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

త్వరలోనే ఆత్మకూర్‌కు పూర్వ వైభవం

ఆత్మకూర్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని, డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆస్పత్రి స్థానంలో వంద పడకలతో కొత్త దాని నిర్మాణం కోసం ప్రతిపాదనలు పెట్టామని, త్వరలోనే అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండశ్రీను, నాగేష్, మణివర్ధన్‌రెడ్డి, రఫీఖ్, మచ్చేందర్‌గౌడ్, ఖాజన్న, చిరంజీవి ఉన్నారు.

రైతు ప్రయోజనాలే..

అమరచింత: రైతు ప్రయోజనాలను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి రైతు వేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీపీఓ అరుణ, ఎంపీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ అనిరుధ్, మహేదర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బసిరెడ్డి ఉన్నారు.

మదనాపురం: మండలంలోని నరసింగాపురం, నెలివిడి గ్రామాల్లో బుధవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మార్కెట్ చెర్మన్ పల్లెపాగ ప్రశాంత్ మాట్లాడుతూ అధికారులు రైతులతో సమన్వయంగా చేసుకుంటూ తేమ శాతం విషయంలో ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో విండో సీఈఓ బాల్‌రాజు, వైస్ చైర్మన్ చీర్ల శ్రీనివాస్, నాయకులు హనుమాన్‌రావు, అక్కల మహాదేవన్‌గౌడ్, కురుమయ్య, వెంకట్‌నారాయణ, టీసీ నాగన్నయాదవ్, రవీందర్‌రెడ్డి, కొండన్న, విజయ్, సత్యం, స్వామి గౌడ్, సిబ్బంది చందు పాల్గొన్నారు.

వనపర్తి: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో గ్రామ మహిళా సంఘం(ఐకేపీ) ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పెబ్బేరు మార్కెట్ చైర్మన్ గౌని ప్రమోదిని, వైస్ చైర్మన్ ఎద్దుల విజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుయాదవ్, శ్రీహరిరాజు, బీరం రాజశేఖరెడ్డి, సొప్పరి రమేష్, రాజేష్ పాల్గొన్నారు.



పాంరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



తాటిపాములలో..



నెల్విడిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చెర్మన్ ప్రశాంత్

## మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేద్దాం

ఖిల్లాఘనపురం: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేద్దామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గొరిపాగ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగాల భర్తీ చేయడం వలన ఎంతో మంది దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. కమిటీ పేరుతో కాలయాపన చేయాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని అసెంబ్లీలో చేప్పిన ముఖ్యమంత్రి రెండు నెలల్లోనే మాటమార్చడం సరైంది కాదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పానుగంటి మల్లేష్ మాదిగ, యాదయ్య మాదిగ, చంద్రయ్య మాదిగ, రాములు మాదిగ, బుచ్చయ్య మాదిగ, బంగారయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మయ్య

## 'సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి'



పాన్‌గల్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ అన్నారు. బుధవారం మండలంలోని మల్లాయిపల్లి, మాధరావుపల్లి, దావత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలకు దీటుగా ప్రజలే సమాధానాలు చెప్పే విధంగా చైతన్యం చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ ఐకమత్యంతో పని చేయాలన్నారు. మల్లాయిపల్లిలోని లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాధరావుపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాలకు సాగునీరు అందించే కేఎల్‌ఐ ఎంజే4 కాల్వను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

వీపనగండ్ల: ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా ఉద్యమాల రూపకల్పనకు మండల కేంద్రంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తేదీన జరిగే బహిరంగసభకు పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాగిరెడ్డి, బాలస్వామి, మౌలాలి, మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

